# సాక్షి
## చిత్తూరు

ఆదివారం । 12 । నవంబర్ । 2023






### పని పేరుతో వేధిస్తున్నారు

పని పేరుతో తనను వేధిస్తున్నారంటూ అపోలో కార్మికురాలు పెట్రోల్ క్యానుతో ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో నిరసనకు దిగింది - 2లో



### పంటలపై ఏనుగుల దాడి

పొలాలపై ఏనుగులు దాడి చేసి, వరి పంటను ధ్వంసం చేశాయని పులిచెర్ల మండలంలోని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. - 2లో



### సీసీ కెమెరాల ధ్వంసం

ఎర్రచందనం అక్రమ రవాణాపై నిఘా ఉంచేందుకు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను దుండగులు ధ్వంసం చేశారు. - 2లో



## న్యూస్‌రీల్

### దేశంలోనే తొలిసారిగా ఏపీలో పెప్పర్ కంపెనీ



ఎంపీ మిథున్‌రెడ్డి

పుంగనూరు: జర్మనీకి చెందిన పెప్పర్ కంపెనీ స్థాపనకు దేశంలోనే తొలిసారిగా ఏపీ ప్రభుత్వం అవకాశం ఇవ్వడంపై ఆ యాజమాన్యం శనివారం కృతజ్ఞతలు తెలుపుతూ సీఎంవోకు లేఖ రాసింది. ఈ వివరాలను రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి మీడియాకు వెల్లడించారు. గత నెల 31న జరిగిన ఏపీ మంత్రి మండలి సమావేశంలో జర్మన్ కంపెనీ పుంగనూరు మండలం ఆరడిగుంట ప్రాంతంలో 800 ఎకరాల్లో సుమారు రూ.5 వేల కోట్లతో పరిశ్రమ ఏర్పాటు చేసేందుకు ఆమోదించింది. దీంతో ఈనెల 29న జర్మన్ కంపెనీ ప్రతినిధులు ఫౌండర్ క్రిష్టియన్‌వాగ్నర్, బ్యాస్టియన్‌ఫ్రెడ్రిచ్, సీఈవో అండ్రియస్, సీఐవో రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో 12 మందితో కూడిన బృందం ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డితో సమావేశం కానున్నట్లు ఎంపీ తెలిపారు. ఎలక్ట్రికల్ బస్సు, ట్రక్కు, బ్యాటరీలు తయారుచేసే ఈ కంపెనీ ద్వారా సుమారు 10 వేల మందికి ఉపాధి లభించనుందని చెప్పారు. ఈ నెలాఖరులో భూసేకరణ పనులకు అవసరమయ్యే నిధులు కంపెనీ వారు డిపాజిట్ చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ బస్సుల కంపెనీ పడమటి నియోజకవర్గాలకు తలమానికంగా నిలవనుందన్నారు.

### విద్యాభివృద్ధికి మౌలానా అబుల్ కలాం కృషి



అబుల్ కలాంకు నివాళులర్పిస్తున్న అధికారులు

చిత్తూరు కలెక్టరేట్: దేశంలో విద్యాభివృద్ధికి మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఎనలేని కృషి చేశారని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి చిన్నారెడ్డి అన్నారు. కలెక్టరేట్‌లో శనివారం మౌలానా అబుల్ కలాం 130వ జయంతి నిర్వహించారు. అబుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి మాట్లాడుతూ దేశంలో విద్యావ్యవస్థ బలోపేతానికి అబుల్ కలాం ఆజాద్ ఎంతో కృషి చేశారన్నారు. విద్యాలయాల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యావ్యవస్థ బలోపేతానికి అనేక చర్యలు చేపడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం సంఘ నాయకులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### పకడ్బందీగా ఇంటింటికీ రేషన్ పంపిణీ



జేసీ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో పకడ్బందీగా ఇంటింటికీ రేషన్ పంపిణీ కార్యక్రమం చేపడుతున్నట్లు జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు అన్నారు. ఆయన శనివారం క్యాంప్ కార్యాలయంలో పౌరసరఫరాల శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికీ రేషన్ పంపిణీ చేయాలని ఆదేశించారు. 336 ఎండీయూ వాహనాలతో జిల్లా వ్యాప్తంగా 5.41 లక్షల లబ్ధిదారులకు సరుకులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటికీ రేషన్ పంపిణీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని చెప్పారు. ఇంటి వద్దకు వెళ్లలేని పరిస్థితులు ఉన్న చోట ఏ పాయింట్ నుంచి రేషన్ పంపిణీ చేస్తారన్న విషయాన్ని వలంటీర్ల సాయంతో ముందు లబ్ధిదారులకు సమాచారం అందించాలన్నారు. ప్రతి నెలా రేషన్ పంపిణీ పూర్తయిన అనంతరం ఎండీయూ ఆపరేటర్లతో మండల స్థాయిలో సమావేశం నిర్వహించి వారికి ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని తెలిపారు. రెండు వేల కంటే ఎక్కువ రేషన్ కార్డులు ఉన్నచోట అదనంగా మరో వాహనం కోసం, పనికిరాని వాహనాల స్థానంలో కొత్త వాహనాల కోసం ప్రతి పాదనలు పంపాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఎస్‌వో శంకరన్, ఏఎస్‌వో శేషాద్రిచలం పాల్గొన్నారు.

# పాతికేళ్ల పసిడి పంట





వి.కోట మండలం తోటకనుమ వద్ద ట్రెల్లీస్ విధానంలో సాగు చేసిన డ్రాగన్‌ఫ్రూట్ తోట (ఇన్‌సెట్) తోటలో విరగ్గాసిన డ్రాగన్ ఫలాలు

విదేశాలకే పరిమితమైన డ్రాగన్ ఫ్రూట్ ఇప్పుడు మన ముంగిట్లో వాలింది. రైతు ఇంట పాతికేళ్ల బంగారు పంటగా మారింది. ఒకసారి సాగు చేస్తే 25 సంవత్సరాల వరకు దిగుబడినిస్తుంది. చీడపీడల బెడద, నీరు, కూలీల ఖర్చు తక్కువ కావడంతో రైతాంగం ఈ డ్రాగన్‌పై మక్కువ చూపుతోంది. ఈ పంటకు మార్కెటింగ్ సదుపాయమూ ఉంది. అన్ని పండ్ల కంటే ఈ పండు ధరలు అధికంగా ఉండడంతో రైతులకు లాభార్జన సులభతరమవుతోంది. దీంతోపాటు పోషకాలను పుష్కలంగా కలిగి ఉన్న ఈ పండు సాగుపై ప్రత్యేక కథనం.

- జిల్లాలో విస్తరిస్తున్న డ్రాగన్‌ఫ్రూట్ సాగు
- ఓ సారి నాటితే 25 ఏళ్లపాటు దిగుబడి
- తొలి రెండేళ్లలోనే పంట పెట్టుబడి చేతికి
- ప్రముఖ ఆన్‌లైన్ సంస్థల్లోనూ మంచి గిరాకీ

పలమనేరు : రకరకాల వాణిజ్య పంటలు, మామిడి తోటల కంటే రెండు దశాబ్దాల పాటు నికర ఆదాయాన్ని అందించే కొత్త వంగడాలవైపు జిల్లాలోని రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఇన్నాళ్లు తైవాన్, వియత్నాం దేశాలకే పరిమితమైన డ్రాగన్ ఫ్రూట్ ఇక్కడి వాతావరణ పరిస్థితుల్లోనూ పండుతోంది. దీంతో మనకూ అందుబాటులోకి వచ్చేసింది. నాటిన తొలి ఏడాది మూడు నుంచి రూ.4 లక్షల పెట్టుబడి పెడితే రెండేళ్లలో ఆ మొత్తం వచ్చేస్తోంది. ఆపై 25 ఏళ్లపాటు ఏటా రైతులకు ఆదాయం వస్తుండడంతో ఇప్పుడు రైతులు డ్రాగన్ సాగుపై మక్కువ చూపుతున్నారు. పైగా ఈ పంటకు చీడపీడల బెడదలు కూలీల సమస్య తక్కువ. ముఖ్యంగా తక్కువ నీటి సౌకర్యమున్న రైతులకు వరం. రైతు పండించిన పంటకు తోటల వద్దే మార్కెటింగ్ సౌకర్యం ఉంది. మరోవైపు స్విగ్గీ, బిగ్‌బ్యాస్కెట్, రిలయన్స్ తదితర ఆన్‌లైన్ సంస్థలు సైతం వీటిని కొనుగోలు చేస్తున్నాయి.

**జిల్లాలో తొలిసారిగా..**

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ములకల చెరువు, కలిచెర్ల, కంభంవారిపల్లి మండలాల్లో కొందరు ఔత్సాహిక రైతులు రెండేళ్లక్రితం డ్రాగన్‌ఫ్రూట్‌ను సాగుచేశారు. అయితే మొట్టమొదట వీకోటకు చెందిన మోహన్‌రావు తన మూడెకరాల పొలంలో 8వేల మొక్కలను ట్రెల్లీస్ విధానంలో నాటారు. ఆయన సియాన్ రెడ్ అనే రకాన్ని హైదరాబాద్ సమీపంలోని శంషాబాద్ నుంచి 8వేల మొక్కలను తెప్పించారు. మొక్కకు రవాణా చార్జీలతో కలిపి రూ.76 ఖర్చయింది. ఆ లెక్కన 8 వేల మొక్కలకు రూ.6 లక్షలు, మొక్కకు ఊతంగా నిర్మించిన 420 సిమెంట్ స్తంభాలు రూ.550 చొప్పున రూ.2.3 లక్షలైంది. దీంతోపాటు ఎరువులు, దున్నకం, కూలీలు ఖర్చులతో మూడెకరాలకు రూ.10 లక్షలు ఖర్చయింది. అంటే ఎకరానికి రూ.3.3 లక్షలన్నమాట. పంటకు సత్తువగా గొర్రె, కోడి ఎరువు, ఆరు బస్తాల సింగిల్ సూపర్‌ఫాస్ఫేట్, ట్రైకో ధర్మావరిడి, సుడోమస్‌లను కలిపి మొక్కకు మక్కిరి మిశ్రమ ఎరువును మాత్రమే వాడారు. పంట నాటాక ఆరు నెలలకు అంటే జనవరిలో నాటితే జూన్‌లో పుష్పాలొచ్చాయి. ఆపై 21 రోజులకు తొలికోత వచ్చింది. తొలికోతలో మూడెకరాలకు రెండు టన్నులు, రెండో కోతలో ఐదు టన్నులు, మూడో కోతలో 13 టన్నుల దిగుబడిని సాధించారు. మొత్తం మీద ఇప్పటికి 30 టన్నుల దాకా దిగుబడి వచ్చింది.

**మంచి పోషకాలు కలిగిన ఫలం**

డ్రాగన్ ఫ్రూట్‌కు విదేశాల్లో ధనికుల ఫలం అనే పేరుంది. కానీనేడు స్థానికంగా ఈ సాగు మొదలు కావడంతో తోటల వద్దే ఫలాలను విక్రయిస్తున్నారు. పండ్ల మార్కెట్లలోనూ ఇవి విరివిగా లభ్యమవుతున్నాయి. ఇందులో మధుమేహం, క్యాన్సర్, మంచిగా జీర్ణం, గుండెకు సంబంధించి, మంచి చర్మకాంతికి, జుట్టు పెరిగేందుకు, ఎముకల పుష్టికి మేలు చేస్తుందట.

**తోటవద్దకే వ్యాపారులు**

తోట వద్దకే వ్యాపారులు వచ్చి కొనుగోలు చేస్తున్నారు. దీంతో పాటు ఆన్‌లైన్ వ్యాపార సంస్థలైన స్విగ్గీ, రిలయన్స్‌మార్ట్, బిగ్ బ్యాస్కెట్, రత్నజీత్ సూపర్ మార్కెట్ల నుంచి వీటికి మంచి గిరాకీ ఉంది. ప్రస్తుతం 400 గ్రాములున్న పండ్లు కిలో రూ.130 వరకు, 250 గ్రాములకంటే తక్కువున్న ఫలాలు కిలో రూ.70 వరకు ధరలు పలుకుతున్నాయి.





డ్రాగన్ ఫ్రూట్స్

**ట్రెల్లీస్ విధానంలో మొక్కల సాగు**

ఇప్పటి వరకూ అనంతపూర్, కడప జిల్లాలో మొదలైన ఈ పంట మూడేళ్ల క్రితం ఉమ్మడి జిల్లాలోని కంభంవారిపల్లి మండలం చీనేపల్లిలో రైతు శ్రీనాథరెడ్డి, కలిచెర్లలో రహంతుల్లా, ములకల చెరువులో ఓ రైతు డ్రాగన్‌ఫ్రూట్‌ను సాగుచేశారు. స్తంభాలపై పాత బైక్‌టైర్లను వాడి ఎకరానికి రెండు వేల మొక్కలను సాగు చేశారు. అయితే ప్రస్తుతం ట్రెల్లీస్ విధానం ద్వారా ఎకరానికి రెండున్నర వేల నుంచి మూడు వేల మొక్కలను నాటుకోవచ్చు. దీంతో అదనపు దిగుబడి రావడంతో అధిక ఆదాయం వస్తోంది.

**ముందు అధ్యయనం చేశా**



నేను మూడెకరాల మెట్ట పొలంలో డ్రాగన్ ఫ్రూట్‌ను సాగుచేశా. ప్రస్తుతం కోతలు సాగుతున్నాయి. తోటవద్దే కాకుండా ఆన్‌లైన్ వ్యాపార సంస్థలకు విక్రయిస్తున్నా. ఇక్కడి వాతావరణం చల్లగా ఉంటుంది. సముద్రమట్టానికంటే 1250 అడుగుల ఎత్తులో ఉన్నాం. దీంతో పంట ఉత్పత్తులు బాగున్నాయి. నేను పంటకు పెట్టిన పెట్టుబడి రెండేళ్లలో వచ్చేస్తుంది. ఆపై 25 ఏళ్ల వరకు తోటను బాగా చూసుకుంటే ఏటా దక్కేది లాభాలే కదా.

– డా.మోహన్‌రావు, రైతు, వీకోట

**కొత్త పంటల సాగుతో మేలు**



ఆహార, వాణిజ్య పంటలను పండించి గిట్టుబాటు గాని రైతులు ఇప్పుడు విభిన్నంగా ఆలోచిస్తున్నారు. సాంఘిక మాధ్యమాల ద్వారా ప్రపంచంలోని పలు రకాల కొత్త వంగడాలు, పంటల సాగుపై మక్కువ పెంచుకుంటున్నారు. ఇటీవల జిల్లాలో డ్రాగన్‌ఫ్రూట్ సాగుపై రైతులు ఆసక్తిని చూపడం మంచి పరిణామం. దీంతో పంట పెట్టుబడి తొలి ఏడాది ఎక్కువగా ఉన్నప్పటికీ ఆపై రెండు దశాబ్దాల పాటు నికర ఆదాయాలుంటాయి.

– మధుసూదన్‌రెడ్డి, జిల్లా ఉద్యానశాఖ అధికారి, చిత్తూరు

# ఊపిరి తీస్తున్న న్యుమోనియా

- చాపకింద నీరులా పాకుతున్న వ్యాధి
- చలికాలంలో కేసుల ఉధృతి
- తక్షణ వైద్యంతోనే నివారణ సాధ్యం
- నేడు న్యుమోనియా నివారణ దినోత్సవం



వార్డులో చికిత్స చేస్తున్న వైద్యులు

**జిలాల్లో న్యుమోనియా వివరాలు..**

| నెల | కేసుల సంఖ్య |
|---|---|
| ఏప్రిల్ | 81 |
| మే | 69 |
| జూన్ | 70 |
| జూలై | 98 |
| ఆగస్టు | 176 |
| సెప్టెంబర్ | 164 |
| అక్టోబర్ | 70 |

చిత్తూరు రూరల్: న్యుమోనియా సైలెంట్ కిల్లర్‌గా పాకుతోంది. ఏటా న్యుమోనియా వ్యాధితో బాధపడుతున్నవారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. వ్యాధి నిరోధక టీకా సరిగా వేసుకోని వారిలో కూడా న్యుమోనియా సోకే అవకాశాలు ఎక్కువగా ఉంటున్నాయని వైద్యనిపుణులు చెబుతున్నారు. ఐదేళ్లలోపు చిన్నారులకు న్యుమోనియా సోకితే ప్రాణాంతకంగా మారుతుంది. పెద్ద వారికి సోకినా సకాలంలో చికిత్స తీసుకోకుంటే ప్రమాదమేనని వైద్యులు సూచిస్తున్నారు. శీతాకాలంలో న్యుమోనియా మరింత ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. నేడు (ఆదివారం)న్యుమోనియా డే సందర్భంగా ప్రత్యేక కథనం.

జిల్లాలో వాతావరణ కాలుష్యం ఊపిరితిత్తుల మీద ప్రభావం చూపుతోంది. ఈ వ్యాధి అన్ని వయసుల వారినీ వెంటాడుతుంది. ముఖ్యంగా ఐదేళ్లలోపు పిల్లలు, 65 ఏళ్లదాటిన వారిలో వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉండడం వల్ల ఈ వ్యాధి బారిన పడుతున్నారు. చలికాలంలో న్యుమోనియా కేసులు నమోదయ్యే అవకాశాలు ఎక్కువ. ఆడవారితో పోల్చితే మగవారిలోనే ఈ వ్యాధి బాధితులు ఎక్కువగా ఉంటున్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ఆస్పత్రుల్లో ఈ కేసులు నమోదవుతుండడం బాధాకరం. ఈ ఆస్పత్రులకు నిత్యం 10 వేల ఓపీలు రాగా అందులో న్యుమోనియా సంబంధిత సమస్యల కోసం 2 వేల ఓపీలొస్తున్నాయి. ఇందులో ప్రతి నెలా 70కి పైగా న్యుమోనియా కేసులు నిర్ధారణ అవుతున్నాయి.

**వ్యాధి నిర్ధారణ**

- సీబీసీ, సీఎక్స్‌ఆర్ వంటి పరీక్షలతో న్యుమోనియాను నిర్ధారించవచ్చు. వ్యాధి తీవ్రతను బట్టి, అవసరాన్ని బట్టి ఛాతీ ఎక్సరే, సీటీ స్కాన్, రక్తపరీక్షలు, కళ్లె పరీక్ష, బ్రాంకోస్కోపీ, పల్స్ ఆక్సీమెట్రీ, ఫ్లూయిడ్ కల్చర్ పరీక్షల ద్వారా ఈ వ్యాధిని నిర్ధారణ చేస్తారు.

**వైద్యులను సంప్రదించాలి**

న్యుమోనియాకు తగిన యాంటీబయాటిక్స్‌తో చికిత్స చేయాలి. డాక్టర్ల పర్యవేక్షణలో తగిన మోతాదును ఇవ్వాల్సి ఉంటుంది. ప్రస్తుత పరిస్థితుల్లో మూడు రోజులకు పైగా జ్వరం, ఛాతీనొప్పి, ఊపిరి సరిగా తీసుకోకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తే, వీలైనంత త్వరగా వైద్యులను సంప్రదించాలి. వారి సలహా మేరకు అవసరమైన అన్ని పరీక్షలు చేయించుకోవాలి.

**వీరితో జాగ్రత్త**

- కానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్
- బ్రాంకైటిస్, ఎంఫసీమా ఉన్నవారు
- గుండె సమస్యలు ఉన్నవారు
- పొగతాగేవారు
- కీమోథెరపీ తీసుకుంటున్నవారు
- ఎయిడ్స్ రోగులు
- ఆస్తమా ఉన్నవారు

**వ్యాధి లక్షణాలు**

- దగ్గు, కళ్లె(గల్ల) పడడం
- కళ్లె పసుపు లేదా పచ్చగా ఉండడం
- దగ్గినప్పుడు రక్తం పడడం
- ఆయాసం, అలసట
- ఛాతీలో నొప్పి
- ఊపిరి పీల్చుకోవటం కష్టంగా ఉండటం
- చలి, జ్వరం
- వణుకు ఉండటం
- తలనొప్పి
- కండరాల నొప్పులు
- చెమటలు పట్టడం
- గుండె వేగంగా లేదా తక్కువగా కొట్టుకోవటం,
- వికారం, వాంతులు, విరేచనాలు
- పిల్లలు పాలు తాగలేకపోవటం

**కారణాలు**

- వ్యాధి ఉన్న వ్యక్తి ముఖానికి కర్చీఫ్ పెట్టుకోకుండా దగ్గినా, తుమ్మినా వారి నోటి తుంపర్ల ద్వారా పక్కన ఉండే వారికి వ్యాధి సోకుతుంది.
- వైరస్, బ్యాక్టీరియా ద్వారా వ్యాప్తి చెందుతుంది.
- వ్యాధి నిరోధక శక్తి తక్కువ ఉన్నవారిలో, దీర్ఘకాలిక రోగాలతో బాధపడేవారిలో, పొగతాగేవారిలో, మద్యపానం చేసేవారిలో, ఊపిరితిత్తుల సమస్యలు ఉన్నవారికి ఈ వ్యాధి సోకే ప్రమాదం అధికం.

**జాగ్రత్తలు తీసుకోవాలి**



వ్యాధి బాధితులు త్వరగా కోలుకోవటానికి వైద్యులు రాసిన మందులు క్రమం తప్పకుండా వాడాలి. ఎక్కువగా విశ్రాంతి తీసుకోవాలి. మద్యపానం, ధూమపానం చేయకూడదు. ధూమపానం చేసేవారికి దూరంగా ఉండాలి. దగ్గినా, తుమ్మినా ముఖానికి కర్చీఫ్ అడ్డుపెట్టుకోవాలి. తరచూ చేతులు శుభ్రం చేసుకోవాలి. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలి. వారంలో కనీసం ఐదురోజులపాటు వ్యాయామం చేయాలి.

–నందీశ్వర్‌రెడ్డి, పల్మనాలజిస్ట్, చిత్తూరు

### వరసిద్ధుని సేవలో కర్ణాటక హైకోర్టు జడ్జి



జడ్జికి స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఆలయ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామిని కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నటరాజన్ దర్శించుకున్నారు. ఆయన శనివారం కుటుంబ సమేతంగా విచ్చేయగా ఆలయ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం వేదపండితుల ఆశీర్వచనంతోపాటు, స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించారు. సూపరింటెండెంట్ వాసు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ రమేష్ పాల్గొన్నారు.

# రూ.2.6 లక్షల టపాసులు సీజ్



స్వాధీనం చేసుకున్న టపాసులతో సీఐ కృష్ణమోహన్, ఎస్‌ఐ శ్రీనివాసులు

**పెద్దపంజాణి:** మండలంలోని నిడిగుంట గ్రామంలో అనుమతులు లేకుండా అమ్ముతున్న రూ.2.6 లక్షల టపాసులను స్వాధీనం చేసుకున్నట్లు గంగవరం సీఐ కృష్ణమోహన్ చెప్పారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో శనివారం ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు. మండలంలోని నిడిగుంట గ్రామానికి చెందిన చిన్న రెడ్డెప్ప, పీ.ఆర్.కిరణ్‌కుమార్ తమిళనాడు రాష్ట్రం హోసూరు నుంచి టపాసులు తీసుకుని వచ్చి ఎటువంటి అనుమతులు లేకుండా విక్రయిస్తున్నట్లు తమకు సమాచారం వచ్చిందన్నారు. దీంతో దుకాణంలో ఆకస్మిక తనిఖీలు చేయగా, రూ.2.6 లక్షల టపాసులను గుర్తించినట్లు చెప్పారు. వాటి నిల్వ, రవాణాకు సంబంధించి ఎటువంటి అనుమతులు లేవని పేర్కొన్నారు. ఈ మేరకు నిందితులపై కేసు నమోదు చేసి, ఆ టపాసులను సీజ్ చేసి, లైసెన్సు కలిగిన గోడౌన్‌కు తరలించినట్లు చెప్పారు. ఈ దాడుల్లో ఎస్‌ఐ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సీసీ కెమెరాలు ధ్వంసం

**చౌడేపల్లె:** మండలంలోని శెట్టిపేట క్రాస్ వద్ద మూడు రోడ్ల కూడలిలో పోలీసులు నిఘా కోసం ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలను దుండగులు ధ్వంసం చేసిన సంఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. గతంలో ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టడానికి, అటవీ అధికారుల సమన్వయంతో చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన రెండు సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. అక్కడే ప్రమాదాల నివారణకు ఏర్పాటుచేసిన బారికేడ్లను పక్కన పడేశారు. విషయం తెలుసుకొన్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ఆరా తీశారు.

## పంటలపై ఏనుగుల దాడి

**పులిచెర్ల(కల్లూరు):** మండలంలోని కమ్మపల్లె పంచాయతీ కురవపల్లె, దేశిరెడ్డిగారిపల్లె, దిన్నెపాటి దళితవాడల్లో శనివారం తెల్లవారు జామున పంటపొలాలపై ఏనుగులు దాడి చేశాయి. డ్రిప్ పైపులైన్లను ధ్వంసం చేసినట్లు రైతులు వాపోతున్నారు.



## ప్రజల జీవితాల్లో వెలుగులు ప్రసాదించాలి

**పుంగనూరు/తిరుమల/చిత్తూరు కలెక్టరేట్/తిరుపతి అర్బన్:** దీపావళి పండుగ ప్రజల జీవితాల్లో వెలుగులు ప్రసాదించాలని మంత్రులు, టీటీడీ చైర్మన్, ప్రభుత్వ విప్, ఎంపీలు, ఎమ్మెల్సీలు, రాజకీయ ప్రముఖులు జిల్లా ఉన్నతాధికారులు ఆకాంక్షించారు. ఆమేరకు శనివారం వారు వేర్వేరుగా శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రకటనలు విడుదల చేశారు.

**వెలుగులు నింపాలని..**



దీపావళి వెలుగుల పండుగ.. పండుగను ప్రతి ఒక్కరు సంతోషాలతో జరుపుకోవాలని రాష్ట్ర విద్యుత్, అటవీ, గనులశాఖ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆకాంక్షించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాగానే భగవంతుని దయతో సకాలంలో వర్షాలు కురుస్తున్నాయని, రైతులు, వ్యాపారులు, ప్రజలు సంతోషంగా ఉన్నారని తెలిపారు. ఇలాగే ప్రతియేటా వర్షాలు కురిసి, కరువు కాటకాలు లేకుండా చూడాలని శ్రీశబరిమలై అయప్పస్వామిని ప్రార్థిస్తున్నానని తెలిపారు.

**భారతీయ సంస్కృతిక ప్రతీక**



ఈ దీపావళి ప్రజలందరి జీవితాల్లో సరికొత్త కాంతులను నింపాలని ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి కోరారు. భారతీయ సంస్కృతికి ప్రతీకగా భారతీయ పండుగలు జరుపుకుంటారన్నారు.

**సుఖ సంతోషాలతో జీవించాలని...**



ఈ దీపావళి పండుగ ప్రజలందరి జీవితాల్లో అష్టైశ్వర్యాలు, సుఖ సంతోషాలు నింపాలని రాష్ట్ర పర్యాటక, యువజన క్రీడా శాఖ మంత్రి ఆర్కే రోజా ఆకాంక్షించారు. అందరూ ఆనందంగా పండుగను జరుపుకోవాలని పేర్కొన్నారు.

**రాష్ట్రం సుభిక్షంగా వర్ధిల్లాలని..**



చెడుపై మంచి విజయానికి ప్రతీక దీపావళి.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో రాష్ట్రం సుభిక్షంగా వర్ధిల్లాలని కోరుతున్నట్లు రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డి తెలిపారు. ప్రజలందరు దీపావళి పండుగను జాగ్రత్తగా జరుపుకోవాలని సూచిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

**వెలుగులు విరజిమ్మాలని..**



ఈ దీపావళి వేళ లక్ష్మీదేవి ఇరు జిల్లాల ప్రజల ఇంట్లో చేరి వారి జీవితంలో వెలుగులు విరజిమ్మాలని తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి, చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప కోరుకుంటూ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

**భగవంతుని ఆశీస్సులు ఉండాలని..**

ప్రజలందరూ సహృద్భావ వాతావరణంలో పండుగను ఆనందంగా జరుపుకోవాలని, అందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో వర్ధిల్లేలా భగవంతుని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఎమ్మెల్సీలు సిపాయి సుబ్రమణ్యం, భరత్, మేరిగ మురళీధర్, బల్లి కల్యాణ్ చక్రవర్తి ఆకాంక్షించారు. ఈ దీపావళి ప్రతి ఇంట్లో ఆనందం సంతోషపు వెలుగులు నింపాలని జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు ఆకాంక్షించారు.

# ఏపీ ఓటరు జాబితాలోనే ఉన్నాం.. ఉంటాం



విచారణ చేస్తున్న బీఎల్‌ఓ వెంకటరమణ

**రామకుప్పం:** మండలంలోని బందార్లపల్లి పంచాయ తీ కంచిదాసనపల్లెకు చెందిన జయరామిరెడ్డి, రాజమ్మ దంపతులకు కర్ణాటకలో ఓటరు కార్డులుండగా, కంచిదాసనపల్లి పోలింగ్ బూత్ నెంబరు 617, 618లో కూడా వీరికి ఓట్లు ఉన్నట్లు ఓ పత్రిక శనివారం వార్తను ప్రచురించింది. నిజనిర్ధారణలో భాగంగా శనివారం స్థానిక బీఎల్‌ఓ వెంకటరమణ కంచిదాసనపల్లిలో నివాసముంటున్న జయరామిరెడ్డి దంపతులను విచారణ చేశారు. వారు మాట్లాడుతూ మేము ఆంధ్రలోనే ఉన్నాం.. ఇక్కడ మాకు ఓటరు కార్డులు ఉన్నాయన్నారు. జీవనోపాధి కోసం వెళ్లిన మాకు 2007లో కర్ణాటకలో ఓటరు కార్డులు మంజూరు చేసినట్లు చెప్పారు. అయితే మాకు శాశ్వతంగా ఆధార్‌కార్డు, రేషన్ కార్డు, వెలుగు గ్రూపులో సభ్యత్వం కంచిదాసనపల్లిలో ఉన్నట్లు ఆధారాలు చూపించారు. స్థిరనివాసం ఉన్న కంచిదాసనపల్లిలోనే ఓటరు కార్డులకు ఆధార్ కార్డులను సీడింగ్ చేసుకున్నట్లు తెలిపారు. ఇక్కడ ఉన్న ఓటరు కార్డులను కొనసాగించాలని జయరామిరెడ్డి దంపతులు బీఎల్‌ఓ ద్వారా రామకుప్పం తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు.

# పని పేరుతో నన్ను వేధిస్తున్నారు

**చిత్తూరు రూరల్:** తనను పనిపేరుతో వేధిస్తున్నారని, తాను గుట్టు విప్పితే ఒక్కొక్కడికి పుట్టగతులుండవని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేసే ఆపోలో కార్మికురాలు చిలకమ్మ బోరున విలపించింది. చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి అత్యవసర విభాగం ఎదుట ఆమె శనివారం పెట్రోల్ క్యాన్‌తో నిరసనకు దిగింది. తనకు అన్యాయం జరిగితే పెట్రోల్ పోసి నిప్పంటించుకుంటానంటూ ఆవేదన వెళ్లగక్కింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆమెతో పోలీసులు నచ్చచెప్పారు. ఆమె మాట్లాడుతూ 14 ఏళ్లుగా ఇక్కడ పనిచేస్తున్నాని, అయితే కొన్ని రోజులుగా పర్యవేక్షణ పేరుతో పెత్తనం చెలాయిస్తున్న ఇద్దరు వ్యక్తులు వేధిస్తున్నారని చెప్పింది. తన చెల్లెలి కుమార్తె రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రికి తీసుకొస్తే, నాలుగు గంటల పాటు చికిత్స అందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించింది. దీనిపై ప్రశ్నిస్తే పనికి రావద్దంటూ బెదిరిస్తున్నారని తెలిపింది. అయితే వారం రోజులకు క్రితం కూడా ఆమె పెట్రోల్ క్యాన్‌తో నిరసన చేయడం తెలిసిందే.

# వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం



రక్షణ్ (ఫైల్), మృతి చెందిన రౌతాయ్

**పుత్తూరు:** పట్టణ పరిసరాల్లో జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఓ చిన్నారితో సహా మరో వ్యక్తి దుర్మరణం పాలయ్యారు. ఎస్‌ఐ గౌరీశంకర్ కథనం మేరకు, శనివారం ఉదయం స్థానిక గేట్‌పుత్తూరుకు చెందిన సతీష్(35), కుమారుడు రక్షణ్(6), కుమార్తె హరిప్రియ(2) మోటార్ సైకిల్‌పై స్థానిక బైపాస్ రోడ్డు నుంచి ఇంటికి బయల్దేరారు. అదే సమయంలో చెన్నై నుంచి తిరుపతి వైపు వెళ్తున్న కారు, ఈ బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో రక్షణ్ మృతి చెందగా, సతీష్, హరిప్రియ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం చెన్నై రామచంద్ర ఆసుపత్రికి తరలించారు.

ఒడిశా రాష్ట్రం పూరీకి చెందిన లారీ డ్రైవర్ రౌతాయ్(42) జమ్మలమడుగు నుంచి సిమెంట్ లోడ్ తీసుకొచ్చి పళ్లిపట్టులో శుక్రవారం రాత్రి అన్‌లోడ్ చేశాడు. తిరుగు ప్రయాణంలో పుత్తూరు వైఎస్సార్ సర్కిల్ సమీపంలో ఓ షాపు వద్ద లారీ ఆపాడు. వాటర్ బాటిల్ తీసుకొని, లారీ ఎక్కే సమయంలో తిరుపతి వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో లారీ డ్రైవర్ రౌతాయ్ అక్కడికక్కడే మృతి చెందాడు. పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో రెండు ప్రమాదాలకు సంబంధించి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు మృతదేహాలను అందజేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.